

ఉపాధి పనుల్లో అధిక చెల్లింపులు

డిఆర్‌పి శ్రీనివాస్

ఉండి: ఉండి మండలం మహాదేవపట్నంలో గత ఆర్థిక సంవత్సరంలో సుమారు రూ.45 లక్షల వ్యయంతో 135 పనులు జరిగాయని, వాటిలో సుమారు రూ.16 లక్షలు చేసిన పనులకన్నా అధికంగా చెల్లించారని గుర్తించామని డిఆర్‌పి శ్రీనివాస్ తెలిపారు. శనివారం సాయంత్రం మహదేవపట్నంలో సర్పంచి వనిమా నాగవెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహించారు. ఎపిఒ ఒమేగా రాజు మాట్లాడుతూ మహాదేవపట్నంలో 1137 జాబ్ కార్డులు ఉండగా 533 మంది ఉపాధి పనులను ఉపయోగించుకున్నారన్నారు. డిఆర్‌పి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి పనులను సర్వే చేసి అధికంగా చెల్లింపులు జరిగిన పనులను గుర్తించి నివేదిక తయారు చేశామని, దీన్ని ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేసిరెడ్డి గోపాలకృష్ణ, ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.

సార్వాలోనూ సాగునీటి కష్టాలు

శివారు భూములకు నీరందక పాట్లు

ఎండుతున్న నారుమళ్లు, నాట్లు



చిన్నమల్లంలో నీరందక ఎండుతున్న నారుమళ్లు

ప్రజాశక్తి - ఆచంట

సార్వా సాగు ఆరంభంలోనే సాగునీటి కష్టాలు మొదలయ్యాయి. ఒకపక్క గోదావరికి వరదొస్తున్నా పక్కనే ఉన్న పంట భూములకు చుక్కనీరు అందని దుస్థితి. వర్షాలు లేకపోవగా ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, మరోపక్క సాగునీరు అందక ఆచంట నియోజకవర్గంలో నారుమడులు ఎండిపోతున్నాయి. కాలువల్లో నీటిమట్టాలు పడిపోవడంతో నాట్లు వేసేందుకు అనువుగా దుమ్ములు చేసే పరిస్థితీ కన్పించడం లేదు. పంట బోదెలు పూడుకుపోవడం, ప్రధాన కాల్వల నుంచి పిల్ల కాలువలకు పూర్తిస్థాయిలో నీరు విడుదల కాకపోవడంతో చేలు శివారు భూములకు నీరందడం లేదు. దీంతో కొందరు రైతులు ఆయిల్ ఇంజిన్లు అద్దెకు తెచ్చుకుని బోదెల్లోని నీటిని తోడుకుంటూ నారుమడులను రక్షించుకుంటున్నారు. దీంతో నాట్లు సాగడం లేదు. దీంతో సార్వా సాగు ఆలస్యమవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాల్వలకు నీరొదిలి సుమారు 40 రోజులు కావొస్తున్నా పంట కాలువల్లో నీళ్లు మాత్రం పుష్కలంగా ఉండని పరిస్థితి. తక్షణమే అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో సాగునీరు అందించాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



దమ్ములకు నీరు లేకపోవడంతో ఎండిపోతున్న పొలాలు

బోదెల్లో నీరేదీ..



పెనుగొండ అయ్యప్ప, కౌలురైతు, చినమల్లం

పంట బోదెల్లో నీళ్లు సరిగా పారడం లేదు. దీంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. సాలు దమ్ములు కూడా చేయలేకపోతున్నాం. సరిగా వర్షాలు లేకపోవడంతో నారుమళ్లు ఎండిపోతున్నాయి. కాలువల్లో నీటిమట్టాలు సక్రమంగా ఉండేలా చూడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

ఇంజిన్లతో నీళ్లు తోడుకుంటున్నాం..



కుడిపూడి శ్రీనివాస్, కౌలు రైతు, , చిన్నమల్లం

ఇంజిన్లతో నీళ్లు తోడుకుని నారుమళ్లను రక్షించుకుంటున్నాం. పది రోజుల్లో నాట్లు వేయాల్సి ఉన్నా ఇప్పటికీ సాలు దమ్ములు చేసేందుకు కూడా నీరందడం లేదు. నారుమడుల సమయంలో నీటిఎద్దడి ఏర్పడితే రానున్న రోజుల్లో పరిస్థితి ఏమిటీ. కాల్వల శివారు భూములకు నీరు సక్రమంగా అందకపోవడంతో ఆయిల్ ఇంజిన్లు ఉపయోగించుకోవాల్సి వస్తుంది. తక్షణమే అధికారులు స్పందించాలి.



వేలేరుపాడు మండలం నుంచి సురక్షిత ప్రాంతాలకు సామాన్లతో తరలుతున్న జనం



కుక్కునూరు-దాచారం మధ్య నీట మునిగిన కాజ్‌వే

వరద గోదావరి

కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే మునక

12 గ్రామాలకు నిలిచిన రాకపోకలు

స్పిల్ వే నుండి 5,02,478క్యూసెక్కుల జలాలు విడుదల

జిల్లా కలెక్టరేట్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ, వేలేరుపాడు, కుక్కునూరుల్లో కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, ప్రాజెక్టుల్లో సామర్థ్యానికి మించి ఉన్న నీటిని గేట్లు తెరిచి దిగువకు వదలడంతో గోదావరికి వరద ఉధృతి పెరుగుతుంది. భద్రాచలంలో గురువారం 27 అడుగులు ఉన్న నీటిమట్టం శుక్రవారం 36.6 అడుగులకు చేరుకుంది. దీంతో కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వేపైకి గోదావరి వరద నీరు ముంచెత్తడంతో వాగు అవతల ఉన్న దాచారం, బెస్తగూడెం, సీతారామపురం, నెమలిపేట, ఉప్పర మద్దిగట్ల, అరవపల్లి, గొమ్ముగూడెం, లచ్చిగూడెం తదితర 12 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రమైన కుక్కునూరు రావాలంటే చుట్టూ 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిన దుస్థితి ఏర్పడింది. గోదావరి వరద అంతకంతకు పెరుగుతుండటంతో మండల ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

వరద ప్రభావిత ప్రాంతాల్లో ఐటిడిఎ పిఒ పర్యటన

గోదావరి వరద ముంపు ప్రభావిత ప్రాంతాలైన లచ్చిగూడెం, గొమ్ముగూడెం గ్రామాల్లో ఐటిడిఎ పిఒ రాములు నాయక్ శుక్రవారం పర్యటించారు. గ్రామస్తులతో సమావేశమయ్యారు. దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలివెళ్లాలని సూచించారు. పిఒ వెంట తహశీల్దార్ కె.రమేష్‌బాబు పాల్గొన్నారు.

దాచారం పునరావాస కేంద్రంలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటు

దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వరద బాధితుల పునరావాస కేంద్రంలో విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు తెలిపారు. శుక్రవారం దాచారంలోని పునరావాస కేంద్రాన్ని ఆయన సందర్శించారు. బాధితులకు ఆహార పదార్థాలు తయారుచేసే వంటశాలలకు, పునరావాస కేంద్రంలో విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. జనరేటర్‌ను కూడా అందుబాటులో ఉంచామన్నారు.

వేలేరుపాడు రూరల్: గోదావరి వరద అనూహ్యంగా పెరుగుతుండటంతో మండలంలోని ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని రుద్రంకోట, రేపాకగొమ్ము ప్రాంతాల ప్రజలు ముందు జాగ్రత్తగా చల్లావారిగూడెం ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, నెమలిపేట ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి తరలివెళ్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్లపై తమ సామగ్రిని సొంత ఖర్చులతో చేరవేసుకుంటున్నారు. గోదావరి ఉగ్రరూపంతో మండలంలోని వేలేరుపాడు నుంచి కోయిదా వెళ్లే మార్గంలోని ఎద్దువాగు కాజ్‌వే మునిగిపోవడంతో సిద్ధారం, టేకూరు, ఎడవల్లి, కోయిదా, కట్కూరు తదితర సుమారు 18 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆ గ్రామాల్లోని ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి నానావస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన వేలేరుపాడులో శుక్రవారం వారపు సంతకు వచ్చేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బోటుపై కాజ్‌వే దాటాల్సి రావడంతో రవాణాఛార్జీలు పెరిగిపోయాయని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి ఆయా గ్రామాల ప్రజలకు నిత్యావసర సరుకులు, బియ్యం సరఫరా చేయడంతోపాటు జనరేటర్లు అందించాలని కోరుతున్నారు.

పోలవరం: పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టు స్పిల్వేలోకి చేరుకున్న 5,02,478 క్యూసెక్కుల అదనపు జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. స్పిల్వే ఎగువన 30.110 మీటర్లు, దిగువన 20.870 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్‌కు ఎగువన 30.500 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్‌కు దిగువన 20.280 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యామ్‌ల మధ్య 15.860 మీటర్లు నీటిమట్టం నమోదైంది. ప్రాజెక్ట్ దిగువన నీటిమట్టం 9 మీటర్లుగా నమోదైందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు.

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు: భద్రాచలం వద్ద గోదావరికి శనివారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. ప్రమాద హెచ్చరిక జారీ చేసిన వెంటనే ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒను కలెక్టర్ ఆదేశించారు. గోదావరికి వరద ఉధృతి దృష్ట్యా ప్రజలెవ్వరూ నదిలోకి వెళ్లొద్దని, ఈతకు వెళ్లడం, చేపలు పట్టడం వంటివి చేయొద్దని అన్నారు. ప్రసవ సమయానికి దగ్గరలో ఉన్న గర్భిణులను సమీప సామాజిక ఆరోగ్య కేంద్రాలకు తరలించాలని, ముంపు ప్రాంత గర్భిణులు, వృద్ధులు, పిల్లలు, విభిన్న ప్రతిభావంతులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అన్నారు. అవసరమైన టార్పాలిన్లు సిద్ధం చేయాలన్నారు. జిల్లాస్థాయిలో 18002331044 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కుక్కునూరు, వేలేరుపాడు మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారని తెలిపారు. దాచారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వరద పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి, నిర్వాసితులకు భోజన వసతి సౌకర్యాలు కల్పించాలని, వైద్య శిబిరాలను కూడా ఏర్పాటు చేయాలని అన్నారు. పునరావాస కేంద్రంలో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని, వాటర్ ట్యాంకర్లు సిద్ధం చేయాలన్నారు. మోటార్ బోట్లు, గత ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు.

నష్టపరిహారం లాభసాటిగా ఇవ్వండి

జెసికి ఎన్‌హెచ్ 165 నిర్వాసిత రైతుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - భీమవరం

ఎన్‌హెచ్ 165 భూసేకరణకు అభ్యంతరం లేదని, నష్టపరిహారం లాభసాటిగా ఉండేలా చూడాలని రైతులు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డిని కోరారు. జాతీయ రహదారి 165 నిర్మాణంలో భాగంగా భీమవరం, గునుపూడి, రాయలం, తాడేరు, చినఅమిరం తదితర గ్రామాల రైతులు లేవనెత్తిన అభ్యంతరాలపై జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం తన ఛాంబర్‌లో జాతీయ రహదారుల అధికారుల సమక్షంలో విచారణ చేపట్టారు. భూసేకరణపై జూన్ 14న అభ్యంతరాల గడువు ముగియడంతో భీమవరం మండలంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన రైతులు లేవనెత్తిన 24 అభ్యంతరాలపై చర్చించారు. ఈ సందర్భంగా రైతులు రోడ్డు అలైన్‌మెంట్, తమ భూమికి లభించే నష్టపరిహారం చెల్లింపు తదితర విషయాలను జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అలైన్‌మెంట్ మార్పు తమ పరిధిలోనిది కాదని, నష్టపరిహారం విషయంలో భూసేకరణ చట్టం 2013 ప్రకారం రైతులకు నష్టపరిహారం చెల్లించడం జరుగుతుందని జెసి చెప్పారు. రైతులు మాట్లాడుతూ ప్రజాప్రయోజనాల దృష్ట్యా భూములను ప్రభుత్వానికి అప్పగించడానికి ఎటువంటి అభ్యంతరాలూ లేవని, కాకపోతే తాము చిన్న సన్నకారు రైతులమని తాము నష్టపోకుండా న్యాయమైన నష్టపరిహారం సాధ్యమైనంత త్వరగా ఇప్పించాలని జాయింట్ కలెక్టర్‌ను కోరారు. అలాగే అలైన్‌మెంట్‌లోని సర్వే నెంబర్లలో తమ భూమి విస్తీర్ణ వివరాలను తెలపాలని రైతులు కోరారు. త్వరలో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి వివరాలను అందజేస్తామని జెసి తెలిపారు. ఈ విచారణలో ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బి డిఇఇ ఎన్.శ్రీనివాసరావు, తహశీల్దార్ రావి రాంబాబు, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సిహెచ్.రవికుమార్, డిటి జి.కళ్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్ రెడ్డి

రూ.80 కోట్లతో ప్రతి గ్రామంలో రక్షిత తాగునీరు

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - యలమంచిలి

పాలకొల్లు నియోజకవర్గంలో జలజీవన్ పథకం ద్వారా రూ.80 కోట్లతో ప్రతి గ్రామంలో రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సూపర్ సిక్స్ హామీలను నెరవేర్చిందన్నారు. బాడవ గ్రామంలో శుక్రవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా టిడిపి శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. గ్రామంలో రూ.39.60 లక్షలతో సిమెంట్ రహదారుల ప్రారంభోత్సవం, తాగునీటి సరఫరా పథకం పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రతి ఇంటిలోనూ సంక్షేమ పథకం అందినట్లుగా ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోకపోయినా ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు, నాయకులు బోనం నాని, సత్యనారాయణరాజు, బొప్పన హరికృష్ణ, గుబ్బల ఏడుకొండలు, చింతా సత్తిబాబు, రాయి కొండ, రాయి సత్యనారాయణ, సర్పంచి రాయి ధనలక్ష్మి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎల్‌ఇ స్కూల్‌లో తరగతుల తరలింపుపై విచారణ

తహశీల్దార్ హామీతో ఆందోళన విరమించిన తల్లిదండ్రులు, సర్పంచి

తొలుత ఆమరణ నిరాహారదీక్ష శిబిరాన్ని తొలగించిన పోలీసులు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర ఎల్‌ఇ స్కూల్‌లో 3, 4, 5 తరగతులను యధావిధిగా కొనసాగించాలని కోరుతూ పెనుమంట్ర సర్పంచి, తాడిపర్తి ప్రియాంక, ఆమె భర్త ప్రసన్న శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద తలపెట్టిన ఆమరణ నిరాహారదీక్షా శిబిరాన్ని పోలీసులు తొలగించి, దీక్షా ప్రయత్నాన్ని భగ్నం చేశారు. దీక్ష కోసం సిద్ధం చేసిన వేదిక, షామియానా, కుర్చీలను ఆ ప్రదేశం నుండి తొలగించారు. దీంతో సర్పంచి దంపతులు, ఎల్‌ఇ స్కూల్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వివిధ సంఘాల నేతలు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వైసిపి నేతలు తహశీల్దార్ కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద బైఠాయించారు. సుమారు నెల రోజులుగా ఈ పాఠశాలలోని తరగతులను మరో పాఠశాలలో విలీనం చేయడానికి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో నిరసనలు తెలుపుతున్నా అధికారులు కనీసం స్పందించకుండా ఉదాశీనంగా వ్యవహరించారని విమర్శించారు. దీనిపై స్పష్టత ఇచ్చే వరకూ ఈ ప్రాంగణాన్ని వీడేది లేదని వారు బైఠాయించారు. తహశీల్దార్ వై.రవికుమార్, ఎస్ఐ కె.స్వామిలకు ఇదే విషయాన్ని స్పష్టం చేసి, సమస్యకు కారణమైన విద్యా శాఖాధికారులు వచ్చి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారి సెలవులో ఉన్నారని ఎస్ఐ సర్ది చెప్పారు. అనంతరం తహశీల్దార్ జోక్యం చేసుకుని తన ఛాంబర్‌లో జెడ్‌పిటిసి కర్రి గౌరి సుభాషిణి, పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, వైసిపి నేతలు గూడూరి పెద్దిరాజు, భూపతిరాజు శ్రీనివాసరాజు, కర్రి వేణుబాబు, సత్తి వెంకటరెడ్డి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ కుమార్, డాక్టర్ మునిబాబు తదితరులతో చర్చించారు. సమస్య వివరాలన్నీ తెలుసుకున్న తహశీల్దార్ మాట్లాడుతూ విద్యాశాఖతో కాకుండా మరో శాఖాధికారులచే దీనిపై విచారణ చేయించి న్యాయం చేస్తానని తహశీల్దార్ రవికుమార్ హామీ ఇచ్చారు. దీంతో ప్రస్తుతం చేపట్టిన ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు గ్రామ సర్పంచి ప్రియాంక, నాయకులు తెలిపారు.



ఆయా కుమార్తెకు ట్రిపుల్ ఐటిలో సీటు

ప్రజాశక్తి - ఆచంట

రేయింబవళ్లు కష్టపడి చదివి పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటిన గ్రామీణ ప్రాంత విద్యార్థి కాండ్రేగుల యువరాణి అత్యంత సాంకేతిక విద్యనందించే ట్రిపుల్ ఐటిలో సీటు సాధించి నేటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. ఆచంట పంచాయతీ పరిధి కవురుపాలెం గ్రామానికి చెందిన కాండ్రేగుల నాగ శ్రీనివాసరావు, సునీత కుమార్తె యువరాణి ట్రిపుల్ ఐటిలో సీటు సాధించి తల్లిదండ్రులకు ఆదర్శంగా నిలిచింది. తండ్రి డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తల్లి సునీత కవురుపాలెంలో అంగన్వాడీ ఆయాగా పనిచేస్తూ కూతురిని ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా తీర్చిదిద్దారు. కష్టపడే తత్వం, క్రమశిక్షణ ఉంటే జీవితంలో ఎదగడానికి పేదరికం అడ్డుకాదని యువరాణి నిరూపించింది. ఆచంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదిలో 577 మార్కులతో టపర్‌గా నిలిచింది. దీంతో యువరాణి ఉన్నత శిఖరాలు అధిరోహించి నూజివీడులో ట్రిపుల్ ఐటి ఇంజినీరింగ్ సీటు సాధించి ఆచంట మండలానికి ఆదర్శంగా నిలిచింది. ఈ సందర్భంగా యువరాణిని సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి జీవిత లక్ష్యాన్ని ఎంచుకోవాలని, దాన్ని సాధించే వరకూ ప్రయత్నం విరమించకూడదన్నారు. అంబేద్కర్, అబ్రహం లింకన్ వంటి మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డు కాదని పేదరికాన్ని ఎదిరించి విజయం సాధించాలని ఆయన కోరారు. అనంతరం యువరాణిని అభినందించి రేటా నేర్పిన పాఠం పుస్తకాన్ని బహుమతిగా అందజేశారు. సిఐటియు మండల కన్వీనర్ వైట్ల ఉషారాణి, మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, పుడకా నాగలక్ష్మి, నక్క శైలజ, కనకదుర్గ, పి.మోహన్‌రావు, తలుపూరి బుల్లబ్బాయి, దాసిరెడ్డి కోటేశ్వరరావు, కుసుమే జయరాజు, బండి రంగారావు, ఎస్‌విఎన్.శర్మ యువరాణిని అభినందించారు.



యువరాణిని సన్మానిస్తున్న దృశ్యం

వైసిపి బాటలోనే కూటమి పాలన

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - తణుకు

ప్రజలపై భారాలు మోపడంలో, నిర్బంధంలోనూ వైసిపి తరహాలోనే కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. శుక్రవారం స్థానిక అమరవీరుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సర కాలంలో రూ.15,485 కోట్లు విద్యుత్ భారాలను మోపారన్నారు. తాము అధికారంలోకి వస్తే విద్యుత్ భారాలు మోపబోమని, ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి వివిధ రూపాల్లో భారాల మోత మోగించారన్నారు. అదాని కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందం రద్దుకు కూటమి ప్రభుత్వం సిద్ధ పడకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లను పగులగొట్టండి అని పిలుపునిచ్చిన లోకేష్ నేడు నోరు మెదపడం లేదని, దుందుడుకుగా స్మార్ట్‌మీటర్లు ఇళ్లకు సైతం బిగించేందుకు సిద్ధమయ్యారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు వల్ల నాలుగు రెట్లు బిల్లులు పెరిగినట్లు ఇప్పటికే అవి బిగించిన దుకాణదారులు వాపోతున్నారని గుర్తు చేశారు. ప్రజలంతా ఈ స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకించాలని, బిగించడానికి వచ్చిన సిబ్బందిని వెనక్కి పంపాలని పిలుపునిచ్చారు. 2014 నుండి 2019 మధ్యలో ఇళ్లు నిర్మించుకున్న 25 వేల మంది లబ్ధిదారులకు రూ.40 వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, వెంటనే వాటిని విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ కాలనీల పట్ల పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతుందన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాలనీల్లో మట్టిపూడిక పనులు పూర్తి కాలేదని, రోడ్లు, తాగునీటి సౌకర్యం లేదని, కనీస వసతులు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. 900కుపైగా ఉన్న ఇళ్లలో ఒక్కటీ పూర్తి చేయలేదన్నారు. గత ప్రభుత్వం వీటి పట్ల తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించగా, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరమైనా ఇళ్లను లబ్ధిదారులకు అందించకపోవడం దారుణమన్నారు. రోడ్లు, కాలువలు, బోదెలు పక్కన పేదలు నివశిస్తున్నారని, వారికి పట్టాలివ్వకపోగా దౌర్జన్యంగా ఖాళీ చేయిస్తున్నారని విమర్శించారు. వారికి అక్కడే పట్టాలివ్వాలని, లేనిపక్షంలో ప్రత్యామాయ స్థలాల్లో ఇళ్లు నిర్మించి ఇచ్చాకే ఖాళీ చేయించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయకుమారి, జిల్లా కమిటీ సభ్యులు కామన మునిస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెఎన్‌వి.గోపాలన్

ఆరోగ్యవంత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి

డిఎంహెచ్‌ఒ డాక్టర్ జి.గీతాబాయి

ప్రజాశక్తి - భీమవరం

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్యఆరోగ్యశాఖ, జిల్లా గణాంక విభాగం, ప్రచార మాధ్యమ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సర్కిల్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు 'మహిళలు శారీరకంగా, మానసికంగా స్థిరంగా (ఆరోగ్యంగా) ఉన్నప్పుడు మాత్రమే గర్భధారణ గురించి ఆలోచించాలి', 'కాన్పుకు, కాన్పుకు మధ్య వ్యవధి పాటించాలి', 'వివాహనికి అమ్మాయి వయస్సు 21, అబ్బాయి వయస్సు 25 అనే నినాదాలతో పట్టణంలో ర్యాలీ సాగింది. అనంతరం మానవహారం నిర్వహించారు. ర్యాలీని డిఎంహెచ్‌ఒ జి.గీతాబాయి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, ఉద్యోగాల నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమని, దీని ప్రభావం ఆర్థికాభివృద్ధిపై స్పష్టంగా పడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ దేవసుధ లక్ష్మి, ఎన్‌హెచ్‌ఎం డిపిఎంఒ డాక్టర్ ధనలక్ష్మి, ఆర్‌బిఎస్‌కె ప్రోగ్రాం అధికారి డాక్టర్ భావన, ఎన్‌టిఆర్ వైద్య సేవలు సమన్వయాధికారి డాక్టర్ కీర్తి, గణాంక అధికారి ఎంఎస్.ప్రసాద్, డిటిహెచ్‌ఎన్‌ఒ వెంకటరమణ, మెడికల్ సిబ్బంది, ఎఎన్‌ఎంలు, ఆశాలు, జిల్లా మహిళా శిశుసంక్షేమ శాఖ నోడల్ అధికారి విజయలక్ష్మి, సిడిపిఒ లక్ష్మీకాంతం, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, భీమవరం మదర్ నర్సింగ్ కాలేజీ నర్సింగ్ విద్యార్థులు, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకివీడు ఎఎంసి ఛైర్మన్‌గా బొల్లా వెంకట్రావు

మరో 14 మంది పాలకవర్గ సభ్యుల నియామకం

ప్రజాశక్తి - ఆకివీడు

ఎట్టకేలకు ప్రభుత్వం ఆకివీడు ఎఎంసి పాలకవర్గాన్ని ప్రకటించింది. గౌరవాధ్యక్షులుగా ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు, ఛైర్మన్‌గా బొల్లా వెంకట్రావుతో పాటు మరో 14 మంది పాలకవర్గ సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఉపాధ్యక్షులుగా జనసేన జిల్లా నేత గవర లక్ష్మి, సభ్యులుగా గురువెల్లి వెంకటలక్ష్మి, ఇల్లాపు కృష్ణవేణి, కొట్టు ఇందిర, ముత్యం ఏసుమణి, నడింపల్లి గీతామహాలక్ష్మి, నరహరిశెట్టి లక్ష్మి, పానకాల కృష్ణాంజనేయరావు, సాలా శ్రీనివాసరావు, వాస్మూరి శ్రీనివాసరావు, వెలగపల్లి అబ్బులు, దాసరి బాలకృష్ణ, షేక్ నదీమ్, యర్రా రవిరాజు సభ్యులుగా నియమితులయ్యారు. కోఆప్షన్ సభ్యులుగా చెరుకుమిల్లి పిఎసిఎస్‌కు లభించింది. ఇక నగర పంచాయతీ ఛైర్‌పర్సన్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి అధికారిక సభ్యులుగా నియమితులయ్యారు. వీరంతా త్వరలో పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు టిడిపి మండలాధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్ తెలిపారు.



సంక్షోభంలో వ్యవసాయ రంగం

ప్రజాశక్తి - పెంటపాడు

వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, సిరపరపు రంగారావు, బంకురు నాగేశ్వరరావు తెలిపారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం వద్ద రైతు సంఘం మండల కమిటీ రెండవ మహాసభ కరక వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ హాజరయ్యారు. గత మూడు సంవత్సరాల కార్యకలాపాల రిపోర్ట్ రైతు సంఘం మండల కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి సభలో ప్రవేశపెట్టారు. ఈ నివేదికను సభ్యులందరూ ఆమోదించారు. తదుపరి నూతన కమిటీ పది మందిని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా తాడి సుబ్బయ్య, కార్యదర్శిగా చిర్ల పుల్లారెడ్డి, మరో 8 మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వ్యవసాయ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం అంతంతమాత్రంగానే ఉందన్నారు. వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు రోడ్డు మీద ఉన్నారన్నారు. ఒక పక్క కోకో, మామిడి రైతులు, బార్లి, పొగాకు రైతులు గిట్టుబాటు ధర లేక వారు పండించిన పంటలు ఏం చేయాలో అర్థం కాని స్థితిలో ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని లేని పక్షాన నూతనంగా ఎన్నుకున్న రైతు సంఘం రైతులను సమీకరించి ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, రైతులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోడూరు తరలిన గురుకుల పాఠశాల

పెనుమంట్ర:మండలంలోని మార్టేరు (నెగ్గిపూడి)లో పూర్వ ఆల్ఫా కాన్వెంట్ భవనాల్లో కొనసాగిన మహాత్మ జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలను పోడూరు గ్రామంలోకి తరలించినట్లు ప్రిన్సిపల్ పద్మ శుక్రవారం తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి గురుకుల పాఠశాల పోడూరులోని కర్నల్ డి.వి.ఎస్.రాజు పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలోని భవనాల్లోకి మారినట్లు ఆమె అన్నారు. పాత మార్టేరులోని ఆల్ఫా స్కూల్‌లోని భవనంలో వసతులు విద్యార్థుల తరగతులు, హాస్టల్ నిర్వహణకు ఇబ్బందిగా ఉన్నందున ప్రభుత్వ అనుమతితో తరలించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

ఉప తహశీల్దార్‌గా సూర్యనారాయణరాజు

ప్రజాశక్తి - ఉండి

ఉండి ఉప తహశీల్దార్‌గా కూనపరాజు సూర్యనారాయణ రాజు బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం సూర్య నారాయణరాజుకు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు ఎస్.చిన్నారావు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం గౌరవాధ్యక్షులు పిల్లి సుబ్బారావు, గ్రామ సర్వేయర్ల సంఘం అధ్యక్షులు గంగ మోహన్ ఆధ్వర్యంలో సిబ్బంది పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తహశీల్దార్ నాగార్జున సూచనల మేరకు సహచర సిబ్బంది సహకారంతో మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. సూర్యనారాయణ రాజు గతంలో వీరవాసరం జూనియర్ అసిస్టెంట్, ఉండిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, నరసాపురంలో సీనియర్ అసిస్టెంట్, పాలకొల్లులో రీసర్వే డిటిగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం ఉండి తహశీల్దార్ కార్యాలయంలో సివిల్ సప్లయ్ ఉప తహశీల్దార్, పూర్తిస్థాయి ఉప తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు.

క్షయ పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆచంట

క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ వ్యాధి అధికారి కె.రవికుమార్ అన్నారు. టిబి ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొడమంచిలిలో టిబి రోగులకు వైద్య సిబ్బంది పోష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా టిబి రోగులను దత్తత తీసుకుని నిక్షయ్ మిత్రలుగా చేరాలని వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కె.హిరెండవ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోగ నిరోధక వ్యవస్థ బలహీనంగా ఉన్న పిల్లలు, వృద్ధులకు టిబి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. పోష్టికాహార లోపం, సిలికోసిస్ ఉన్న వారిలోనూ ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ వ్యాధి ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కొడమంచిలి-2 ఎంఎల్‌హెచ్‌పి కాలరాని ఒక పేషెంట్‌ను దత్త తీసుకుని పోష్టికాహారం కిట్ అందజేశారు. కార్యక్రమంలో టిబి సూపర్‌వైజర్ దుర్గాప్రసాద్, మోహన్, ఎఎన్ఎం ధారా పుష్పరాజు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పల్లెపాలెంలో ఫ్రైడే డ్రైడే

కాళ్ల:ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచితే దోమల బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని జిల్లా ఎపిడమియాలజిస్ట్ గాతల సుభాష్, ఎఎస్ఎస్ఎవో.మూర్తి తెలిపారు. కలవపూడి పిహెచ్‌సి ఆధ్వర్యాన పల్లెపాలెంలో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలోని గృహాలను సందర్శించి నీటి నిల్వలో దోమల లార్వా కోసం పరిశీలించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.పాల్సన్, పంచాయతీ సెక్రటరీ జెవిఎస్ఎన్.మూర్తి, ఎంఎల్‌హెచ్‌పి ఎవిఎంపి పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ఆకివీడు

అజ్జమూరు గరువు ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో పాస్టర్ ఇంటి సుకుమార్, సుగుణ దంపతులు విద్యార్థులకు రూ.3 వేల విలువైన నోట్ పుస్తకాలు శుక్రవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు ఆర్‌విఎస్.నారాయణ, సహోపాధ్యాయుడు వర్ధిని దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. డ్రాయింగ్, తల్లికి వందనం వ్యాస రచనలో విజేతలకు బహుమతులు అందజేశారు.

గణపవరం : గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం సరిపల్లి మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు 65 మందికి నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యాన సేవా కార్యక్రమాలతోపాటు విద్యార్థులకు కావాల్సిన పుస్తకాలు అందజేసే వారి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి కెవిఎస్.మూర్తి, జోన్ పర్సన్ గారపాటి నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ల్యాబ్ సిబ్బందిని కఠినంగా శిక్షించాలి'

పాలకొల్లు రూరల్: విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ల్యాబ్ సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని వైసిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి జయ సరిత డిమాండ్ చేశారు. యాళ్ళవాని గరువులోని వైసిపి కార్యాలయంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కాకినాడ జిజిహెచ్ ఆసుపత్రిలో పారా మెడికల్ ల్యాబ్ టెస్టుల చేయించుకోవడానికి వచ్చిన విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ల్యాబ్ సిబ్బందిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జోగాడ ఉమామహేశ్వరరావు, చేనేత విభాగం జిల్లా అధ్యక్షులు వీరా మల్లికార్జునుడు, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దవా రాజేష్, మామిడి శెట్టి చిట్టిబాబు పాల్గొన్నారు.

సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకుందాం రండి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గీత కార్మికుల సమస్యలను కలెక్టర్‌కు చెప్పుకుందాం రండని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం కల్లుగీత సహకార సొసైటీ అధ్యక్షుల సమావేశం దాసరి సూరిబాబు అధ్యక్షతన స్థానిక సిఐటియు ఆఫీసులో నిర్వహించారు. ఈ సందర్భంగా కామన మునిస్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు గీత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక సమస్యలను పరిష్కరించలేదని తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల ద్వారా లిక్కర్ అమ్ముతున్నారని, దీని వల్ల గీత కార్మికులకు అమ్మకాలు లేక ఉపాధి కోల్పోతున్నారన్నారు. తాటి, ఈత చెట్లపై నుంచి ప్రమాదవశాత్తు పడి మరణించిన, వికలాంగులైన వారికి ప్రభుత్వం ఎటువంటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వడం లేదని, ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14న కలెక్టర్‌కు గీత కార్మికుల సమస్యలు తెలియజేసేందుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. రాజుపాలెపు సాంబమూర్తి, దాసరి నరసింహమూర్తి, గుబ్బల నాగభూషణం, పెనుమర్తి శ్రీను పాల్గొన్నారు.

రూ.45 కోట్లతో రైల్వేస్టేషన్ అభివృద్ధి

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ

తాడేపల్లిగూడెం: రూ.45 కోట్ల వ్యయంతో తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు చేపట్టినట్లు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్‌వర్మ తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఆయన తాడేపల్లిగూడెం నుండి బెంగుళూరు వెళ్తూ తాడేపల్లిగూడెం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తాడేపల్లిగూడెంలో హాల్ట్ రాబోతున్నట్లు తెలిపారు. తన సొంత నిధులు, దాతల సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌ను మంత్రి అభినందించారు. రాష్ట్ర విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం రైల్వేగూడ్స్ షెడ్ అభివృద్ధికి రూ.8 కోట్లు, రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం మరో రూ.18 కోట్లు ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

లాభాల బాటలో కాళ్లకూరు సొసైటీ

నూరుశాతం బకాయిలు వసూలు

ప్రజాశక్తి - కాళ్ల

సహకార సంఘాలు చాలా వరకు రుణ వితరణ, ఇతర సేవలకే పరిమితం అవుతున్నాయి. మరికొన్ని సంఘాలు రైతుల అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా వాణిజ్య సరళిలో తమ వ్యాపార కార్యకలాపాలను విస్తరిస్తూ సంఘం, రైతుల అభివృద్ధికి తోడ్పడుతున్నాయి. ఈ కోవకు చెందినదే కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం. రైతులకు సేవలందిస్తూ ఆదాయ మార్గాల వైపు దృష్టిసారిస్తోంది. చిన్న సంఘమైనా సేవల్లో ముందుంటూ రైతులు, ప్రజల మన్ననలు పొందుతోంది.

46 ఏళ్ల నుంచి ఏ గ్రేడ్..

కాళ్లకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 46 ఏళ్ల నుంచి ఏ గ్రేడ్ సొసైటీగా పేరుగాంచి ప్రగతి పథంలో పయనిస్తోంది. ఏటేటా లాభాలను పెంచుకుంటూ సేవల్లో జిల్లాలోనే ఆదర్శంగా నిలుస్తోంది.

29 ఏళ్లుగా నూరుశాతం బకాయిలు వసూలు..

29 ఏళ్లుగా సభ్యుల నుంచి రికవరీలో ప్రథమ స్థానం పొంది ఏటా అవార్డులు అందుకుంటోంది. మంచి దృక్పథంతో గ్రామీణ రైతులకు రుణాలు అందించేలా 1939లో పెన్మత్స వెంకట సోమరాజు కాళ్లకూరు సొసైటీని ఏర్పాటు చేశారు. సొసైటీ మొదటి అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 375 మంది సభ్యులతో ప్రారంభమైంది. 29 ఏళ్ల పాటు ఏకధాటిగా ఏకగ్రీవంగా ఎన్నికై సొసైటీ అభివృద్ధికి తోడ్పడ్డారు. సంఘం తొలినాళ్లలో కేవలం వేల రూపాయల్లో మాత్రమే లాభాలను ఆర్జించేది. సొసైటీ అధ్యక్షుల పర్యవేక్షణ, సిబ్బంది పనితీరు, సభ్యుల సహకారంతో డిపాజిట్లు గణనీయంగా పెరిగాయి.

2024 - 25లో రూ.19 కోట్ల 48 లక్షల 59 వేలు సంఘం సభ్యుల నుంచి వసూలు చేశారు. క్రాఫ్ లోన్లు రూ.కోటీ 65 లక్షల 30 వేలు, మధ్య వాయిదా అప్పులు రూ.4 లక్షల 14 వేలు, ఎస్ఎల్ఎఫ్ లోన్లు రూ.41 లక్షల 43 వేలు, ఒన్ ఫండ్ కెసిసి అప్పులు రూ.31.13 లక్షలు, క్యాష్ క్రెడిట్ లోన్లు రూ.17 కోట్ల 6



కాళ్లకూరు సొసైటీ భవనం

లక్షల 59 వేలు, మొత్తం రూ.19 కోట్ల 48 లక్షల 59 వేల రుణాలు అందజేశారు. గత 29 సంవత్సరాలుగా నూరు శాతం బకాయిలు వసూలు చేశారు. ప్రస్తుతం 1528 మంది సంఘం సభ్యులు ఉన్నారు. డిపాజిట్లు రూ.23 కోట్ల 21 లక్షలు, షేర్ క్యాపిటల్ రూ. కోటీ 6 లక్షల 24 వేలుగా ఉంది. డిసిసిబిలో ఇన్వెస్ట్మెంట్స్ రూ.9 కోట్ల 71 లక్షల 12 వేల 983 రూపాయలు, సంఘం రిజర్వ్ నిధులు రూ.కోటీ 71 లక్షలు, డిసిసిబి రిజర్వ్ నిధులు రూ.11 కోట్ల 44 లక్షల 61 వేలు, డిసిసిబి బారోయింగ్స్ కోటీ 68 లక్షల 5 వేల 312 రూపాయలతో సంఘం లాభాల బాటలో పయనిస్తోంది.

వరి,ఆక్వా రంగం..

ఈ ప్రాంతంలో వరి, ఆక్వా రంగం విస్తరించింది. రైతులు కష్టపడి తత్వం ఉన్న వారు కావడంతో చేప, రొయ్యల సాగులో రాణిస్తున్నారు. సంఘం పరిధిలో కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల్లోని రైతులకు, ప్రజలకు, వరి రైతులకు పంట రుణాలు, ఆక్వా రైతులకు ఫిష్ ఫీడ్ రుణాలు బ్యాంకు ద్వారా అన్ని రకాల రుణాలు అందిస్తున్నారు. డిసిసిబి వారికి సొసైటీకి ప్రత్యేక శ్రద్ధతో సహకారం అందిస్తున్నారు.

వార్షిక టర్నోవర్ రూ.43 కోట్లు..

సహకార బ్యాంకులో రూ.43 కోట్ల వార్షిక టర్నోవర్ నడుస్తోంది. పంట రుణాలు, బంగారు ఆభరణాలు, చేపల మేత వివిధ రకాల రుణాలు మంజూరు చేస్తూ రైతులకు, ప్రజలకు చేయూతనిస్తూ రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటూ సొసైటీని సభ్యులు ముందుకు నడిపిస్తున్నారు. కాళ్లకూరు, జువ్వలపాలెం, ఏలూరుపాడు గ్రామాల రైతులు, ప్రజలకు సేవలందిస్తోంది. రైతులకు రూ.19 కోట్ల 48 లక్షల 59 వేల రుణాలు అందజేశారు. రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వడమే కాకుండా వారి కుటుంబ ఆర్థిక స్వాలంబనకు సహకార బ్యాంక్ ఎంతో ఉపయోగపడుతుంది. డిపాజిట్లపై వడ్డీ రేటు 10 శాతం (ఏడాది కాలపరిమితి) బంగారు, ఆభరణాలపై 12 శాతం రుణాలు అందిస్తోంది.

నూరుశాతం బాకాయిలు వసూలు..

ఇబ్బా శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి, కాళ్లకూరు



మొత్తం రూ.19 కోట్ల 48 లక్షల 59 వేల రుణాలు అందజేశాం. గత 29 సంవత్సరాలుగా నూరు శాతం వసూలు చేస్తున్నాం. ఏటా డిపాజిట్లు పెరుగుతున్నాయి. సొసైటీ ద్వారా రైతులకు, ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్నాం.

సొసైటీ ప్రగతి బాగుంది

ఆఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి కె.వర్షిని



కాళ్లకూరు సొసైటీలో ఇచ్చిన రుణాలు నూరుశాతం వసూలుకు సహకరించిన సంఘ సభ్యులకు, డిసిసిబి వారికీ, సంఘ సిబ్బందికి, రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు. సొసైటీ పనితీరు, సొసైటీ ప్రగతి బాగుంది.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మాట్లాడుతున్న అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్

జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు తాడేపల్లిగూడెం 11వ అదనపు జిల్లా జడ్జి షేక్ సికిందర్ భాషా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులు పరిష్కరించుకోవాలన్నారు. దాని వల్ల సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి, జూనియర్ సివిల్ జడ్జి ఎస్.సూర్యకిరణశ్రీ, ఫస్ట్ ఎడిషనల్ సివిల్ జడ్జి కె.లలితాదేవి, మధ్యవర్తిత్వంలో శిక్షణ పొందిన న్యాయవాదులు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిరిగినీడి విజయకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

నరసాపురం: నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గాంధీబొమ్మ సెంటర్ నుండి బస్టాండ్ వరకు శుక్రవారం వన్ కె వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతియుత జీవనానికి మధ్యవర్తిత్వం సులువైన మార్గమని, మధ్యవర్తిత్వంతో మేలైన పరిష్కారం దొరుకుతుందని అన్నారు. మధ్యవర్తిత్వం సమయాన్ని, ధనాన్ని ఆదా చేసే మార్గమని, శాంతిని పొందే సన్మార్గమని తెలిపారు. ఆయా కోర్టుల్లో పెండింగులో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. తద్వారా ఇరు పక్షాలకు సమన్యాయం దక్కుతుందన్నారు. ఇటీవలే నరసాపురం బార్ అసోసియేషన్‌లోని ఐదుగురు న్యాయవాదులు మధ్యవర్తులుగా శిక్షణ పొందారని వివరించారు. చివరిగా బస్టాండ్ సర్కిల్ వద్ద మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఆర్.వరలక్ష్మి, ఎస్.రాజ్యలక్ష్మి, డిఎస్‌పి డాక్టర్ జి. శ్రీవేద, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చేగొండి బాలాజీ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పూడికతీత పనుల పరిశీలన

నరసాపురం:పట్టణంలోని 21వ వార్డులో నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య శుక్రవారం డ్రెయినేజీ పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురుగు సమస్యలు లేకుండా చేయడానికి డ్రెయినేజీ పూడిక తీత పనులు చేపట్టామన్నారు. మురుగు నీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, తద్వారా ప్రజలు అంటూ రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పాత్రుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి వాకర్స్ క్లబ్ సాయం

పాలకొల్లు :పాలకొల్లు బ్రాడీపేట 1వ వీధికి చెందిన ఇయ్యపు నరేంద్ర బాబు కాలేయ సంబంధిత సమస్యతో బాధపడుతూ స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి అవసరమైన ఖరీదైన ఇంజెక్షన్లు ఆసుపత్రిలో అందుబాటులో లేకపోవడంతో వాకర్స్ క్లబ్‌ను సంప్రదించాడు. స్పందించిన క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు 18 వేల రూపాయల విలువైన రెండు ఇంజెక్షన్లను క్లబ్ సభ్యులతో కలిసి శుక్రవారం ఆసుపత్రిలో అతనికి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్‌రావు, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు, క్లబ్ సభ్యులు జవ్వాజి కల్యాణ్, నంబూరి గంగా పవన్, చామా శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే కూటమి ధ్యేయం

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మండలంలోని కెపి.పాలెంసౌత్, కెపి.పాలెంనార్త్ గ్రామాల్లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండల శాఖ అధ్యక్షుడు గుబ్బల నాగరాజు, చినిమిల్లి రాధాకృష్ణ, బి.పెద్దిరాజు, లక్కు శ్రీను, కడలి వీర వెంకట మోహన్, నాగిడి రాంబాబు, గుడిపాటి వరదరాజు, యాండ్ర గంగరాజు, కవురు సుబ్రహ్మణ్యం, బి.రామస్వామి, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి ప్రణాళిక

పాలకొల్లు :2026లో వచ్చే పుష్కరాలకు క్షీరా రామలింగేశ్వరా స్వామి వారి దేవస్థానాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలనే ప్రణాళిక రూపొందించడానికి ఇంజినీరింగ్ బృందం శుక్రవారం ఆలయాన్ని పరిశీలించారు. గోదావరి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ హరి సూర్య ప్రకాష్, డిస్ట్రిక్ట్ డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాస్ రాబోయే పుష్కరాలకు దేవాలయానికి దర్శనం కోసం వచ్చే యాత్రికులకు తగిన ఏర్పాట్లు చేసేందుకు దేవాలయం వద్ద అవసరమైన పనులు ప్రారంభించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించేందుకు దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ ఇఒ ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆలయ సిబ్బంది, సూపరింటెండెంట్ వాసు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసాపురం

వైఎన్ కళాశాల సామాజిక సేవా కేంద్రం, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో పోలీస్ శాఖ వారిచే మాదకద్రవ్యాల నివారణపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పట్టణ సిఐ బి.యాదగిరి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు, యువత ప్రస్తుతం మాదకద్రవ్యాల మత్తులో ఉంటున్నారన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల విచక్షణా రహితంగా ప్రవర్తిస్తారన్నారు. అత్యాశ వల్ల బెట్టింగ్ యాప్స్, ఈ లోన్స్, ద్వారా మీరు మరింత సొమ్మును పోగొట్టుకుంటారే తప్ప దానివల్ల మరిన్ని గొడవలు జరుగుతాయన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఈగల్ ఎలైట్ యాంటీ నార్కోటిక్ గ్రూప్ ఫర్‌లా ఎన్ ఫోర్స్‌మెంట్ టీమ్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా మత్తు పదార్థాల సాగు, అమ్మకం, వాడకంపై ఈ టీమ్ నిఘా వేసి వాటి నిర్మూలనకై కృషి చేస్తోందన్నారు. ఈ సందర్భంగా పట్టణ ఎస్ఐ సిహెచ్ జయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, వైస్ ప్రిన్సిపల్ బెజవాడ వెంకటరత్నం, కమ్మిల రంగారావు, డీన్ ఆచార్య గంధం శ్రీ రామకృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ కొప్పినీడి రమణ పాల్గొన్నారు.

73 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు

గణపవరం:గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో అన్ని సచివాలయాలకు చెందిన 73 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఓంకార్ నాద్ మాట్లాడుతూ ప్రతి గర్భిణీ తప్పనిసరి నాలుగు సార్లు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలన్నారు. ఐరన్, కాల్షియం మాత్రలు వాడాలన్నారు.గర్భిణులకు ప్రతి నెలా 9, 10 తేదీల్లో వైద్య పరీక్షలు చేస్తామని తెలిపారు. సిహెచ్ఒ జాలాది విల్సన్‌బాబు మాట్లాడారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

కాళ్ల:విద్యార్థులకు దాతలు అందిస్తున్న సాయం అభినందనీయమని జువ్వలపాలెం హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.రవిశంకర్ శుక్రవారం తెలిపారు. జువ్వలపాలెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు టిడిపి మహిళా కార్యకర్తలు విద్యార్థులకు భోజనం ప్లేట్లు బహూకరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్, పలువురు ఉపాధ్యాయులు, టిడిపి మహిళా కార్యకర్తలు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధితునికి లయన్స్ క్లబ్ సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

పాలకొల్లు :పాలకొల్లు లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు వి ఎన్ డి . వరప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా పుట్టుకతో అంగవైకల్యంతో ఉండి కదలలేని స్థితిలో ఉన్న బోళ్ల చరణ్‌కు రూ.పది వేలు ఆర్థిక సహాయం అందించారు. టిడ్కో గృహంలో నివసిస్తున్న బోళ్ల విష్ణు, సువర్ణ సుందరి దంపతుల కుమారుడు చరణ్. చరణ్ పుట్టుకతోనే అంగవైకల్యంతో కదలలేని స్థితిలో ఉన్నాడు. 36 సంవత్సరాలుగా మాట్లాడడం గాని సంజ్ఞలు చేయడం గాని లేదు. దాతలు తమ కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుని తల్లి వేడుకుంటోంది. పాలకొల్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శిడగం సతీష్, సెక్రటరీ దోనెల ప్రసాద్ శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, శిడగం ఈశ్వర్, కడిమి పెదబాబు, ఉత్తమ ఉపాధ్యాయులు రాయపూడి భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

కడియద్దలో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మండలంలోని కడియద్దలో స్వచ్ఛ సర్వేక్షన్ కేంద్ర బృందం శుక్రవారం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయాలు, స్కూల్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పరిస్థితి, మురుగునీటి పారుదల, పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ ఎం.మధుమతి గ్రామంలో వ్యక్తిగత గృహాలను ర్యాండమ్‌గా పరిశీలించారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉన్నదీ, లేనిదీ, ఆ ఇంటి పరిసరాలు, ఇంటి ఆవరణలో ఏమైనా కూరగాయలు, పండ్లు పెంచుతున్నారా లేదా అనే అంశాలను కేంద్ర సర్వర్ తో డైరెక్ట్‌గా సర్వే చేశారు. చెత్త విడదీయడం, ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయడం, వర్మీ తయారు చేయడం, తదితర అంశాలను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షన్ బృందం సభ్యులు జి.రవికిరణ్, జిల్లా కన్సల్టెంట్ ఎం.సంతోష్ కుమార్, ఎంపిడిఒ ఎం.విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ సోమేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ ఎం.వెంకటేష్, ఎఇ రాజా శ్రీనివాస్, కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

బిడ్డ బిడ్డకూ దూరం ఉండాలి

ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

ప్రజాశక్తి - గణపవరం

జనాభా నియంత్రణ రేపటి కుటుంబ సంక్షేమానికి పునాది అని గణపవరం పిహెచ్‌సి డాక్టర్ కె.ఓంకార్‌నాద్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలిలో పాల్గొని మాట్లాడారు. చిన్న కుటుంబం చింతలేని కుటుంబం అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జాలాది విల్సన్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాళ్ల : కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత జనాభా నియంత్రణపై ప్రతిజ్ఞ చేయించారు. వైద్యాధికారి డాక్టర్ సిహెచ్‌వి రంగం నాయుడు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ చేపట్టారు. బిడ్డకూ బిడ్డకూ మధ్య అంతరం పాటించాలని నినాదాలు చేశారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలన్నారు. ఈ ర్యాలీలో వైద్యాధికారులు సరాబు సునీల్, డి.సునీత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడు : యువత తమలోని నైపుణ్యాలు పెంపొందించు కోవాలని, తద్వారా దేశం అభివృద్ధి పథంలో ముందుకెళ్తోందని దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.సుజాత వివరించారు. కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ సుజాత అధ్యక్షత వహించి మాట్లాడారు. కళాశాల తెలుగు అధ్యాపకులు టి.ఓగేశ్వరరావు మాట్లాడారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యు.శ్రీనివాసరావు, ఆంగ్ల అధ్యాపకులు కె.శామ్యూల్, భౌతికశాస్త్ర అధ్యాపకులు సిహెచ్ విజయ్‌అనిల్ దాయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : బిడ్డకు బిడ్డకూ మధ్య రెండు నుండి మూడు సంవత్సరాల వ్యవధి ఉండాలని లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.నవ్య జీవన్ తెలిపారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నవ్య జీవన్ మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో అధిక శాతం ఒకరితో కుటుంబ నియంత్రణ పాటిస్తున్నారని తెలిపారు. దీన్ని ఇద్దరూ లేక ముగ్గురు పిల్లలు ఉండేలా కుటుంబ వ్యవస్థ మారాలని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్ ఎస్‌కె.అమలేశ్వరరావు, ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పి పాల్గొన్నారు.

ఉండి : తల్లీ బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే పిల్లల మధ్య దూరం పాటించడం చాలా అవసరమని ఉండి పిహెచ్‌సి డాక్టర్ పిఎల్.సునంద అన్నారు. తల్లీ బిడ్డల ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునంద మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ కృష్ణ కుమార్, పిహెచ్ఎన్‌లు ఇప్పి కుమారి, ఎఎన్ఎంలు కృష్ణవేణి, మద్ద షర్లి, పుష్ప, ఎంఎల్‌హెచ్‌పిలు శాంతి, స్పందన, శృతి, ఆశ పాల్గొన్నారు.

పాలకొల్లు ఎఎంసి కమిటీ ఇదే

పాలకొల్లు: పాలకొల్లు ఎఎంసి పాలకవర్గ నియామకాన్ని ప్రభుత్వం పూర్తి చేసింది. ఇప్పటికే అధ్యక్షులుగా కోడి విజయభాస్కర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా ఉపాధ్యక్షులుగా దాసరి రత్నరాజు, సభ్యులుగా బిట్రా లక్ష్మినారాయణ, గరికిపాటి రాజేశ్వరి, గుబ్బల లక్ష్మి, జడ్డు లక్ష్మితులసి అమ్మాజీ, కలిదిండి రామచంద్రరాజు, కొక్కిరిమెట్ల అమ్మాజీ, కొండేటి లక్ష్మి, కొప్పిశెట్టి జ్వాల, రాయి శ్రీనివాసరావు, వాసా భ్రమరాంబ, నీలం నారాయణమూర్తి, పారుపల్లి వీర వెంకటలక్ష్మీ కనకదుర్గ, సానబోయిన వెంకట శ్రీనివాసరావులను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వీరు త్వరలో మంత్రి నిమ్మల రామానాయుడు సమక్షంలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

విత్తన శుద్ధితో త్వరగా మొలకలు

ఉండి:విత్తన శుద్ధి చేయడం వల్ల విత్తనాలు త్వరగా ఎక్కువ ప్రమాణంలో మొలకెత్తుతాయని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది జి.శ్రావణ దుర్గ, మొగ్గ దుర్గ అన్నారు. శుక్రవారం పెదపుల్లేరులోని పంట పొలాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో కలిసి వరి నాట్లు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజామృతంతో నారు శుద్ధి చేసి నాటడం జరిగిందని, దీనివల్ల విత్తనాలు త్వరగా మొలకెత్తుతాయని తెలిపారు. భూమి ద్వారా, విత్తనాల ద్వారా పంటలకు సంక్రమించే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. నేల నుండి సంక్రమించే పురుగుల నుండి కొంతవరకూ పంటకు రక్షణ లభిస్తుందన్నారు.

కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వహించాలి : ఎంపిడిఒ

ఆచంట:సమాచార చట్టంలో నిబంధనల మేరకు రుసుం కట్టించుకుని సకాలంలో సమాచారం అందించాలని ఎంపిడిఒ కృష్ణమోహన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో యాక్ట్ పి4 కార్యదర్శులు సమాచార హక్కు చట్టం దరఖాస్తు దారులకు నిబంధనల మేరకు రుసుము కట్టించుకుని సకాలంలో సమాచారం ఇవ్వాలని, అశ్రద్ధ కారణంగా కమీషన్‌లో అప్పీల్ ఫైల్ అయితే నిర్లక్ష్యంగా పరిగణించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పి4లో మార్గదర్శులను రిజిస్టర్ చేయాలని చైల్డ్ ఆధార్ నమోదు చేయాలని, బయోమెట్రిక్ అప్‌డేట్ పూర్తి చేయాలని గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. డిప్యూటీ ఎంపిడిఒ కె.బులి సూరన్న, కార్యదర్శులు నాగబాబు ప్రసాద్ పాల్గొన్నారు.

పోరాటాల చరిత్ర ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ సొంతం

తాడేపల్లిగూడెం:కార్మిక హక్కులకై త్యాగాలు, పోరాటాలు చేసిన చరిత్ర ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ సొంతమని ఎఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ పేర్కొన్నారు. ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ 74 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం డిపో వద్ద యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని తాడేపల్లిగూడెం డిపోలో ఘనంగా నిర్వహించారు. డిపో కమిటీ అధ్యక్షులు చోడగిరి వెంకటరమణ తొలుత యూనియన్ జెండాను ఎగరవేశారు. అమరజీవి కపర్ది విగ్రహానికి ఆర్‌టిసి సీనియర్ ఉద్యోగి డిఎస్ఎన్.రెడ్డి పూలమాల వేశారు. సోమసుందర్, ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు మాట్లాడారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ హామీ ఇచ్చారని డిపో నాయకులు తెలిపారు.

'హామీలు అమల్లో కూటమి విఫలం'

మొగల్తూరు:కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు విమర్శించారు. శుక్రవారం సాయంత్రం ముత్యాలపల్లిలో మొగల్తూరు మండల అధ్యక్షులు రేవు నారాయణ రాజు అధ్యక్షతన వైసిపి నరసాపురం నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ ఎన్నికల్లో వైసిపికి 11 సీట్లు వచ్చినా ఓటింగ్ 40 శాతం ఉందన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను పార్టీ కార్యకర్తలు, నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో నరసాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి గూడూరి ఉమాబాల, పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, కేంద్ర పాలకమండలి సభ్యులు పిడి.రాజు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం మండలం, కాత్రేనిగుంట, ఆదర్శనగర్, డోర్ నెం: 1-2-24/2 కాపురస్తులు గంపల పూర్ణ ఆనంద నాగలక్ష్మి, W/o. గంపల విజయ్‌కుమార్ (లేటు) అను నా యొక్క ఒరిజినల్ దస్తావేజులు పడిపోయినవి. దస్తావేజు నెం: **3299/2018** ది. 02-07-2025 తేదీన నా స్వగృహము కాత్రేనిగుంట, ఆదర్శనగర్ నుండి భీమవరం తాలూక ఆఫీస్ వద్దకు జిరాక్స్ తీయుంచు నిమిత్తం మోటారు సైకిల్ పై వస్తుండగా దారి మధ్యలో పడిపోయినవి. **3299/2018** గల ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికినచో ఈ క్రింది నంబరుకు తెలియజేయగలరు.

గంపల పూర్ణ ఆనంద నాగలక్ష్మి
W/o. విజయ్‌కుమార్ (లేటు)
Mobile: 95508 10644

CHANGE OF NAME

I, **PERURI RAMACHANDRA RAO** (New Name), S/O Manikyam, Previously Called **PERURI RAMA CHADRA RAO** (Old Name), Resident of D.No.3-152/2, Kamma Vari Street, Sidhantham Village, Penugonda Mandal, W.G.Dt., Pin-534326, Andhrapradesh. I have changed my name from **PERURI RAMA CHADRA RAO** (Old Name) To **PERURI RAMA CHANDRA RAO** (New Name) for all practical purposes.